ప్రజాశక్తి

బుధవారం 17 జులై 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మంత్రి వద్దకు కార్పొరేషన్ పంచాయితి



విజయవాడలో కమిషనర్, ఎమ్మెల్యేతో చర్చిస్తున్న మంత్రి నారాయణ

- ఎమ్మెల్యేల ఫిర్యాదులు
- కమిషనర్‌కు ఆకస్మికంగా పిలుపు
- త్వరలో కౌన్సిల్ సమావేశానికి ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడంలో అధికారులు స్పందించడం లేదని నగర ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. ఈ మేరకు దశల వారీగా వారి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తొలుత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నశీర్ అహ్మద్, బి.రామాంజనేయులు తమ సమస్యలను ప్రస్తావించారు. తరువాత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినా అధికారులు స్పందించడం లేదన్న అసంతృప్తితో తాజాగా సోమవారం మునిసిపల్ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన నారాయణ మంగళవారం సాయంత్రం విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయంలో మునిసిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. తరువాత కమిషనర్‌ను పిలిపించి మాట్లాడారు.

నగరంలో పారిశుధ్యం, శివారు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు, రోడ్ల సమస్యలపై మంత్రి కమిషనర్‌ను ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే నశీర్, కమిషనర్‌తో పాటు అధికారులతో ఆయన పలు అంశాలపై చర్చించారు.ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలను ఆయన కమిషన్‌కు వివరించగా ఆమె నగరంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. పారిశుధ్యం అధ్వానంగా మారిన నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. చిన్నపాటి వర్షంకు డ్రెయిన్లు పొంగడడం, కల్వర్టుల కింద పూడిక తీత జరగడంపైనా శ్రద్ధ పెట్టామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరణ సమస్యలు పరిష్కరించాలని ▶ 2లో



చేబ్రోలులో ఎస్ఎఫ్ఐ ఆందోళన

దళిత బాలిక హంతకులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

మృతురాలి కుటుంబానికి పరామర్శ - చేబ్రోలులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు కొత్తరెడ్డిపాలేనికి చెందిన దళిత బాలిక హత్య ఘటనలో హంతకులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) వద్ద వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 7వ తరగతి చదువుతున్న బాలిక స్కూలుకు వెళ్లి తిరిగిరాని స్థితిలో, కుటుంబ సభ్యులు వెతుకుతుండగా నాగరాజు అనేవ్యక్తి ఇంటి వద్ద బాలిక పాదరక్షలను గుర్తించి తలుపులు పగలగొట్టి చూడగా బాలిక హత్యకు గురైందని, నాగరాజు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందని అన్నారు. అతన్ని వెంటనే అరెస్టు చేసి విచారణ జరిపి నిజనిజాలు తేల్చాల్సి ఉందన్నారు. పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి నిందితులపై చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత రెండు ▶ 2లో



విలేకర్లతో మాట్లాడుతున్న పాశం రామారావు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు ఎదుర్కొనే వివిధ ప్రధాన సమస్యల పరిష్కారానికి కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం చొరవ చూపాలని, ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి జిల్లాలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకూ పొడిగించేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలన్నారు. ఛానల్ విస్తరణ వల్ల 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. నల్లమడ వాగు, మేకల వాగు, కొండవీటి వాగు ముంపును నివారించాలని, గుంటూరు ఛానల్‌లో తూటికాడ తొలగించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తిచేసి 25 వేల ఎకరాలకు నీరు అందించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 50 ఏళ్ల నుండి షుమారు 22 వేల పేద కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్నారని, దీర్ఘకాలంగా సిపిఎం ఆధ్వర్యంలో పట్టాల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే లోకేష్ హామీనిచ్చారని, తాడేపల్లి ▶ 2లో

డయేరియాతో మరొకరు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



మృతుడు ఓర్సు ఆంజనేయులు (ఫైల్)

డయేరియాతో పిడుగురాళ్లలో మరొకరు మృతి చెందారు. పట్టణంలోని లెనిన్ నగర్ చెందిన ఓర్సు ఆంజనేయులు (60) వారం రోజుల క్రితం వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా నరసరావుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ రెండ్రోజులపాటు వైద్యం పొందినా కోలుకోకపోవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. ▶ 2లో



కుడికాల్వలకు నేడు నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ కుడి కాల్వకు బుధవారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓ అండ్ ఎం ఇఇ శ్రీహరి మంగళవారం తెలిపారు. కుడి కాల్వ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఈ నీటి విడుదల కొనసాగుతుందన్నారు. మొత్తం 4.5 టీఎంసీలను రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 9 రోజుల పాటు విడుదల చేస్తామని తెలిపారు.

పల్నాడు కలెక్టర్ తొలి సమీక్ష

ఇసుక, పారిశుధ్యం, ఇతర అంశాలపై ఆదేశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి సారిగా సారి జిల్లా స్థాయి మరియు మండల స్థాయి అధికారులతో పల్నాడు జిల్లా కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులంతా బాధ్యతాయుతంగా, సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. తక్షణ ప్రాధాన్యత కలిగిన పలు అంశాలు, శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు. కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను తహశీల్దార్‌లు త్వరితగతిన విచారణ చేసి ఈ నెల 18 నాటికి పూర్తి చేయాలన్నారు. అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు అందుబాటులో లేని దరఖాస్తుదారుల కుల ధ్రువీకరణ, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితా ఆధారంగా పూర్తి చేయాలని, గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులపై నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారాలు చూపాలని చెప్పారు. తహశీల్దార్లు చౌక ధరల దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇసుక తవ్వకాల కోసం అవసరమైన పర్యావరణ అనుమతులు వెంటనే పొందేలా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో పారిశుధ్య పనులను స్వయంగా మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. పంచాయతీల్లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డేని గురు, శుక్ర రెండు రోజులూ నిర్వహించాలన్నారు. మండల పరిషత్ అధికారులు మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీలు చేయాలని, ప్రతి ఎంపీడీవో వారానికి కనీసం ఒక పాఠశాల, ఒక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ఆదేశించారు. సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు 1వ తేదీన 100 శాతం పంపిణీ పూర్తి కావాలని, ఉదయం 5 గంటలకే తొలి పింఛను పంపిణీ జరగాలని అన్నారు. మండల స్థాయిలో బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, డీలర్ ఇన్చార్జులుగా వీఆర్వోల స్థానంలో ఇతరులను నియమించాలని, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరుకుల రవాణా ఆలస్యం కాకుండా చూడాలని చెప్పారు. సాగర్ నుంచి విడుదల చేసే నీటిని కేవలం తాగునీటికి మాత్రమే వాడేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సాగుకోసం సాగర్ నీటి లభ్యత, ఇప్పటి వరకూ నమోదైన వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ ప్రణాళిక అమలు చేయాలని, కంది సాగు రైతులకు అవసరమైన సహాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

వైసిపి వేధింపుల బాటలోనే టిడిపి

ఒత్తిళ్లను ఆపకుంటే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి : సిఐటియు

2 లో

కిడ్నీ విక్రయం కేసులో ఇద్దరు అరెస్టు

2 లో

ఎన్నికల హామీలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పట్టణంలో శిలాఫలకాన్ని సైతం ఆవిష్కరించారని, వెంటనే ఇళ్ల పట్టాల మంజూరుకు పూనుకోవాలని కోరారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డుకు భూములిచ్చిన రైతులకు ప్యాకేజిని పెంచాలని, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలని, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు నెలకు రూ.6 వేలు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని లోతట్టు ప్రాంతాలు జలమయమై, దోమలు వ్యాప్తి చెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా నీటిని క్లోరినేషన్ చేయాలని, బ్లీచింగ్ రెగ్యులర్‌గా చెల్లించాలని, అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్ ఆందోళన చేసిన వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, కె.నళినికాంత్, నాయకులు కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డయేరియాతో మరొకరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఐదు రోజులు వైద్యం పొందుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. పట్టణంలో డయేరియా బారినపడి ఇప్పటికే ఆరుగురు మృతి చెందగా తాజాగా మరో మరణం పట్టణ వాసులను కలవరపెడుతోంది. వ్యాధి అదుపులోకి వస్తుందని అధికారులు, చెబుతున్నా, రెండ్రోజుల్లో నియంత్రించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తున్న ఇక్కడివారు భయకంపితులవుతున్నారు. అధికారులు తక్షణమే పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మంత్రి వద్దకు కార్పొరేషన్ పంచాయితి

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. రెండ్రోజుల్లో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. నగరంలో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్ల మరమత్తులను కూడా ప్రజా సౌకర్యార్థం కార్పొరేషన్ వారు మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు త్వరలో పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. నగరంలో డ్రెయిన్లలో పూడికతీత పనులపై వివరాలు అడిగిన మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం డ్రెయిన్‌లు పొంగే అవకాశం ఉన్నందున పూడికతీత పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బి రహదారుల మరమ్మతులపై మంత్రి జనార్ధన్‌రెడ్డితో నారాయణ ఫోన్‌లో మాట్లాడారు. గత మూడున్నరేళ్లలో వైసిపి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై టిడిపి ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఇదిలా ఉండగా కౌన్సిల్‌లో వైసిపికి ఆధిపత్యం ఉండటం, ఆ పార్టీ కార్పొరేటర్లు ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ఎన్నికలకు ముందు పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని కమిషనర్‌పై వత్తిడి పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో ఉన్న బిల్లులను మొత్తం కమిషనర్ పెండింగ్‌లో పెట్టారు. కార్పొరేషన్‌లో వివిధ విభాగాల కింద ఖర్చుచేసిన దాదాపు 100 బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో వైసిపి నాయకులు గుర్రుగా ఉన్నారు. వీరిలో కొంతమంది టిడిపి నాయకుల వద్ద కమిషనర్, అధికారులపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న నిర్వహించాలనుకున్న కౌన్సిల్ భేటిని కమిషనర్ ఆమోదించకపోవడంతో వైసిపి నేతలు గుర్రుగా ఉన్నారు. తాము చెప్పిన పనులు కూడా తక్షణం కమిషనర్ స్పందించడంలేదని టిడిపి నేతలు అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలో ఎవరి స్థాయిలో వారు ప్రభుత్వంకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఈ క్రమంలో త్వరలో గుంటూరులో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ కమిషనర్‌కు సూచించారు.

వైసిపి వేధింపుల బాటలోనే టిడిపి

ఒత్తిళ్లను ఆపకుంటే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి హయాంలో నాడు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడిన సందర్భంలో ఆందోళన శిబిరాలను టిడిపి నేతలు సందర్శించి మద్దతు తెలిపారని, అయితే ఇప్పుడు వారు కూడా వైసిపి విధానాలనే అనుసరిస్తున్నారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ విమర్శించారు. సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ సమావేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సిఐటియు మంగళవారం జరిగింది. సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి అధ్యక్షత వహించారు. ముజఫర్ అహమ్మద్ మట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లను, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, అంగన్వాడీలను గతంలో వైసిపి బెదిరించినట్లుగానే బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడి సెంటర్ల వద్దకు వెళ్లి రాజీనామాల కోసం కార్యకర్తలను టిడిపి నాయకులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కక్షపూరిత రాజకీయాలు చేయొద్దని ఒకవైపు సిఎం చంద్రబాబు చెబుతున్నా ఎమ్మెల్యేలు, మంత్రులు, టిడిపి నేతలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సిఎంను యూనియన్ నాయకులు కలవగా స్కీం వర్కర్లకు న్యాయం చేస్తామని, కొంత సమయం ఇవ్వాలని హామీ ఇచ్చారని తెలిపారు. స్కీం వర్కర్లను రాజీనామాలు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్లను ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఇప్పటికే బలవంతంగా రాజీనామా చేయించిన అంగన్వాడీలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, బి.మహేష్, పి.వెంకటేశ్వర్లు, సిలార్ మసూద్, టి.శ్రీను, ఎం.హరిపోతురాజు, బందగీ సాహెబ్ పాల్గొన్నారు.

కిడ్నీ విక్రయం కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మహేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కిడ్నీ తీసుకుని సొమ్ము ఇస్తామని చెప్పి మోసం చేసిన కేసులో ఇద్దర్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామాని గుంటూరు పశ్చిమ డిఎస్‌పి కె.వి.మహేష్ మంగళవారం తెలిపారు. విజయవాడకు చెందిన సయ్యద్ యూసఫ్ సోనుబాషా, కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన నిమ్మకాయల సుబ్రమణ్యంను అరెస్టు చేసినట్టు తెలిపారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం గార్లపాటి మధుబాబు పెద్ద ఎత్తున అప్పులు కావడంతో కిడ్నీ అమ్మేందుకు ఆన్‌లైన్‌లో ఒక ప్రకటనను చూసి సిద్ధమయ్యాడని, మధ్యవర్తితో కిడ్నీ ఇచ్చేందుకు బేరాలు చేశాడని డీఎస్పీ తెలిపారు. విజయవాడలో కిడ్నీ అవసరమైన వ్యక్తి బంధువులతో మాట్లాడుకుని కిడ్నీ ఇస్తే రూ.30 లక్షలిచ్చేలా మధుబాబు కొంతమందితో ఒప్పందం చేసుకున్నాడని, అయితే కిడ్నీ తీసుకున్నప్పటికీ ఒప్పందం ప్రకారం ఇస్తామన్న డబ్బు ఇవ్వకపోవడంతో బాధితుడు మధుబాబు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టామన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన బాషా, సుబ్రమణ్యంను అరెస్టు చేసినట్టు తెలిపారు. మొత్తం ఐదుగురు నిందితులుకాగా మరో ముగ్గుర్ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో నగరంపాలెం సిఐ మధుసూధనరావు పాల్గొన్నారు.



కౌలు రైతు గుర్తింపు కార్డుల పంపిణీని వేగవంతం చేయాలి : ఎఒ

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతు కార్డుల మంజూరును వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారిని బి సుధారాణి తెలియజేశారు, ఈరోజు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల ఆవశ్యకతను రైతులకు తెలియజేసి టార్గెట్ కు అనుగుణంగా కౌలు రైతు కార్డుల జారీ చేపట్టాలని సూచించారు, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు వంటి వాటికి కౌలు రైతు కార్డులు ఉపయోగపడతాయని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.లాజరస్ పాల్గొన్నారు.

డెంగీ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

డెంగీ వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ జి లావణ్య సూచించారు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీళ్ల నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు కాలవల్లో నీరు పారుదల ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు, పెదనందిపాడు గ్రామంలో డెంగ్యూ వ్యాధి వ్యాపించే విధానం, వ్యాధి వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాల పై గ్రామ ప్రజలకు అవగాహన కలిగించేందుకు డెంగ్యూ వ్యతిరేక మాసపు ర్యాలీని చేపట్టారు, కార్యక్రమంలో సి హెచ్ ఓ ఎస్ ఆర్ ప్రసాద స్వామి,సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్,సూపర్వైజర్స్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

23 నుండి 27 వరకు ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి -పొన్నూరు

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో ఈనెల 23 నుండి 27వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ సీఎంఈ నయీమ్ అహ్మద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ క్యాంపుల వివరాలను ఆయన తెలియజేశారు. 23న 1,2, 17 సచివాలయాలకు సంబంధించి సాంబశివ నగర్ కాలనీలో క్యాంపులు నిర్వహిస్తారు. 6 సచివాలయంకు సంబంధించి నాగులచెరువు వద్ద క్యాంపు జరుగుతుంది. 24న 11, 13 సచివాలయాలకు సంబంధించి ఇందిరానగర్ లో జరుగుతుంది. 7వ సచివాలయంకు సంబంధించి జయభారత్ రెడ్డినగర్ సచివాలయంలో నిర్వహిస్తారు. 25న 12,14 సచివాలయాలకు సంబంధించి గాజులపాలెంలో క్యాంపు జరుగుతుంది. 9,10 సచివాలయాలకు సంబంధించి టీచర్స్ కాలనీలో క్యాంపు నిర్వహిస్తారు. 26న 15,16 సచివాలయాలకు సంబంధించి ఎస్సీ ఎస్టీ కాలనీలో నిర్వహిస్తారు. 8వ సచివాలయం కు సంబంధించి డి ఆర్ కె కాలనీలో ఏర్పాటు చేశారు. 27న 3,4 సచివాలయం సంబంధించి జెండాచెట్టు సచివాలయంలో క్యాంపు నిర్వహించనున్నారు. 5 సచివాలయం కు సంబంధించి క్యాబిన్ పేట సెక్రటేరియట్లో ఆధార్ క్యాంపు జరుగుతుంది. 1,2,17,11,13,12,14,15,16,3,4 సచివాలయాల్లో పెరవలి కళ్యాణ వర్మ వార్డు ఎడ్యుకేషన్ సెక్రెటరీ, 6,7,9,10,8,5 సచివాలయాలలో డి .కిరణ్ సెక్రెటరీ ఆధార్ క్యాంపుల్లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు.



దళిత బాలిక హంతకులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం



గుంటూరులో జిజిహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

(మొదటి పేజీ తరువాయి)

నెలల కాలంలోనే రాష్ట్రంలో మహిళలపై అనేకచోట్ల అత్యాచారాలు జరుగుతున్నాయని, వీటిని నిలువరించాలని కోరారు. బాలికను అత్యాచారానికి గురిచేసి హత్యచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలనన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. బాధితుల్ని పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు ఇ.అప్పారావు, డి.లక్ష్మీనారాయణ, వై.కృష్ణకాంత్, కిరణ్ ఉన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

బాలిక హత్యను నిరసిస్తూ మండల కేంద్రమైన చేబ్రోలులో ఎస్ఎఫ్ఐ, స్థానిక ప్రజల మంగళశారం ఆందోళన చేశారు. మసీదు సెంటర్ కూడలి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ అనంతరం సెంటర్‌లో కూడలి వద్ద రాస్తారోకో చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ మాట్లాడుతూ చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని, వీటిని నిలువరించడంతోపాటు దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ఇలాంటి కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరగా విచారణ చేయాలన్నారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోవడంతో పొన్నూరు రూరల్ సిఐ అక్కడికి చేరుకున్నారు. నిందితుని కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని, ఒకటి రెండ్రోజుల్లో పట్టుకుంటామని హామీనివ్వడంతో రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను, శశి, మణికంఠ, శ్యామ్, జగదీష్, ధనుష్, అఖిల్, స్థానికులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బాలిక హత్యపై మండల పరిషత్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్ ఆవేదన వెలిబుచ్చారు. నిందితుడ్ని సాధ్యమైనంత త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.



ఆర్‌టిసి కొత్త బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో కొత్త బస్సులను ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. గుంటూరు జిల్లాకుమొత్తం 30 బస్సులు కేటాయించగా గుంటూరు -1 డిపోకు ఇంద్ర ఎసి, గుంటూరు -2 డిపోకు అల్ట్రా డీలక్సు కొత్త బస్సులను కేటాయించారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఈడి ఆదం సాహేబ్, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్, ఆర్‌టిసి అధికారులు ఎం.ఇబ్రహీం, నర్రా శ్రీనివాసరావు, రామకృష్ణారావు, అబ్దుల్‌సలాం, సత్యనారాయణ, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ భాష అభివృద్ధి పై విద్యార్థుల్లో ఆందోళనవద్దు : డిఇఒ

ప్రజాశక్తి -పొన్నూరు

ఉర్దూ భాష అభివృద్ధి గురించి విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ భరోసా వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పిడుగురాళ్ల, కారంపూడి, నకరికల్లు, తురకపాలెం (నరసరావుపేట), నులకపేట, వేజెండ్ల, చందోలు, చిన్నమట్లపూడి, రాయపూడి తదితర ప్రాంతాలలో ఉర్దూ తరగతులను ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా చేయమని వినతులు రావడం ద్వారా వాటిని ఉన్నత పాఠశాలలుగా చేయాలని కోరుతూ ఉన్నతాధికారుల అనుమతి కోసం లేఖల ద్వారా నివేదించినట్లు డిఈఓ శైలజ పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిగిలిన ప్రాథమికోన్నత పాఠశాలలు కూడా ఉన్నత పాఠశాలలుగా చేసేందుకు దరఖాస్తులను సంబంధిత ఉప విద్యాశాఖ అధికారి వారి ద్వారా పంపిన యెడల దానిపై ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని ఆమె వివరించారు. అంతే తప్ప ఉర్దూ భాష గురించి విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురికావాల్సిన అవసరం లేదని డీఈవో శైలజ స్పష్టం చేశారు.

గృహ నిర్మాణంలో పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు 2016 నుండి 2019 వరకు మంజూరైన గృహ నిర్మాణాలకు బిల్లులు నిలిచిపోయాయి. ఆనాటి టిడిపి ప్రభుత్వం లక్షన్నర రూపాయలతో గృహ నిర్మాణం చేసుకునేందుకు ఇల్లు మంజూరు చేయడం జరిగింది. తాడేపల్లి రూరల్, దుగ్గిరాల మండలాల గ్రామాలకు ఉపాధి హామీ పథకం కూడా వర్తింపజేయడం జరిగింది. నిరుపేదలైన ప్రజలు పక్కా గృహ నిర్మాణం చేస ుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసింది. 2019 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంగళగిరి నియోజకవర్గంలో కోట్ల రూపాయల బిల్లులు నిలిచిపోయాయి. టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చేయకుండా నిలిపివేశారు. దీంతో పేదలు వడ్డీలకు తెచ్చుకొని ఏదో ఒక విధంగా నిర్మాణాన్ని పూర్తి చేసు కున్నారు. మరలా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు వస్తాయేమో అని చెప్పి ఎదురు చూస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో దుగ్గిరాల మండలంలో 543 గృహ లబ్ధిదారులకు గాను కోటి 49 లక్షల 45 వేల రూపాయలు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మంగళగిరి రూరల్ మండలంలో 500 గృహ లబ్ధిదారులకు కోటి 35 లక్షల ఐదు వేల, 500 రూపాయలు మంజూరు కావాల్స ఉంది. తాడేపల్లి రూరల్ గ్రామాల్లో 151 లబ్ధిదారులుగాను రూ.43 లక్షల 56వేల 190 మందూరు కావాల్సింది. మంగళగిరి పట్టణంలో నలుగురు లబ్ధిదారులుగాను రూ.46వేల రెండు వందల మంజూరు కావాల్సి ఉంది. ఈ బిల్లుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ మంత్రిగా కూడా ఉండడంతో ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లే మూలం

ప్రజాశక్తి -మేడికొండూరు



పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా స్వీకరించి, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఇంటిల్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయ కుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ విద్యార్థులు మంగళవారం పలు రకాల మొక్కలకు సంబంధించిన విత్తనాలను కొండపరివాహక ప్రాంతంలో చల్లారు. కొండాలనిండా చెట్లు మొలవాలని ఆకాంక్షిస్తూ, చెట్లు మనకు ప్రణాదారమని మానవులకు సకలం వాటి నుంచే సమాకూరుతున్నాయని కోనూరి జయకుమార్అన్నారు. త్వరలో గ్రామాల్లో కూడా మొక్కలు నాటి ఒక్కొక్క మొక్క ఒక్కొక్క విద్యార్థి, దత్తత తీసుకునేలా కార్యక్రమం చేపట్టబోతున్నట్లు ప్రిన్సిపాల్ కే. అశోకరాణి జయకుమార్ తెలిపారు. కార్యక్రమం లో స్కూల్ ఎస్ పి ఎల్ షేక్. ఉమర్ మస్తాన్, పి డి షేక్. రన్ను హుస్సేన్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

236 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఒక వ్యక్తినిఅరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు మాచర్ల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.పి కిషోర్ తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దుర్గి మండలం తేరాల గ్రామానికి చెందిన అంకిపల్లి రామ మోహన్ రావు గహంలో నిల్వ చేసిన 180 ఎంఎల్ సామర్థ్యం గల ఇంపీరియల్ బ్లూ 48 సీసాలు, 180ఎంఎల్ సామర్థ్యం గల రాయల్ సాంగ్ 45 సీసాలు, గోల్డ్ విస్కీ 43 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడు రామ్మోహనరావు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ కెపి కిషోర్ తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామంలోనీ మురుగు కాలువల లో మురికి నీరు పేరుకుపోయినది .దీనితో మంగళవారం యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ వారు పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ ఆధ్వర్యంలో కార్యదర్శి ఎం శరత్ తక్షణ చర్యలు చేపట్టారు. మురుగునీరు కాలువలు శుభ్రపరచడం, ఫినాయిల్ చెల్లడం తోపాటు దారులకు ఇరుపక్కల బ్లీచింగ్ సున్నం చెల్లె కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంటురోగాలు ప్రజలకుండా తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- మేడికొండూరు

రోడ్డుపై వేగంగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరి మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగింది. అమరావతి మండలం పొందుగల గ్రామానికి చెందిన అరెకట్ల శివనాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వైపు నుండి నరసరావుపేట వెళుతున్నాడు. ఎదురుగా వస్తున్న కారు ముందు వాహనాన్ని అధిగమించ కపోయి వేగ నియంత్రణ కోల్పోయి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పొందుగల కు చెందిన ఆరెకట్ల శివనాగేశ్వరరావు(36) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన స్వర్గం వెంకట శ్రీనివాస్ కొండపల్లి ఇబ్రహీంపట్నం కు చెందిన సెట్టి రోష్మి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మంగళవారం మెజర్ లైన ప్రేమ జంట తెనాలిలో ఓ దేవాలయంలో వివాహం చేసుకొని, మంగళగిరి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో రోష్మి మిస్సింగ్ కేసు నమోదు కాగా, మంగళగిరి పట్టణ పోలీసులు ప్రేమ జంటను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

మల్లేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - తెనాలి

మండల పరిధిలోని పెదరావూరు భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో దొంగలు పడ్డారు. స్థానికులు, పోలీసులు, ఆలయ కమిటీ బృందం వెల్లడించిన వివరాల ప్రకారం గత రాత్రి దుండగులు ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. గర్భాలయంలోకి ప్రవేశించిన దుండగులు అమ్మవారి బంగారు అభయ హస్తాలు, పాదాలు, బంగారు కళ్ళు, మంగళ సూత్రాలు, బొట్టు అపహరించారు. వీటి విలువ దాదాపు రూ రెండు లక్షల ఉంటుందని ప్రాథమిక అంచనా. అలాగే శివుని నాగాభరణాలు, పానపట్టం వంటి సుమారు పది లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు అపహరణకు విఫలయత్నం చేశారు. దొంగలు తెలివిగా వ్యవహరించి సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేసి, హార్డ్ డిస్కులు ఎత్తుకెళ్లారు. గతంలో ఇదే ఆలయంలో రెండు సార్లు చోరీకి విఫల యత్నంచేసిన దుండగులు మూడవ సారి భారీ చోరీకి పాల్పడ్డారు. గత మూడు రోజుల క్రితం భట్టిప్రోలు, వెల్లటూరు గ్రామాలతో సహా కష్ణాజిల్లాలోని పలు ఆలయాల్లో చోరీ చేసిన ముఠా పనిగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఎం అభిమాని మృతి - కళ్లు దానం

ప్రజాశక్తి - యడ్లపాడు



మండలంలోని లింగారావుపాలేనికి చెందిన సిపిఎం అభిమాని చిలుమూరి పాలలోచన (90) సోమవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులైన గురుస్వామి, సుబ్బారావు సిపిఎంలో పని చేస్తున్నారు. పాలలోచన భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు పి.సుబ్బారావు, జె.శంకరరావు, జి.హరిబాబు, ఎ.సుబ్బారావు, ఎం.పద్మారావు సందర్శించి నివాళులర్పించారు. పాలలోచన తన కళ్లను డాక్టర్ అగర్వాల్ ఐ రీసెర్చ్ సెంటర్‌కు దానం చేయడంతో మంగళవారం ఉదయం సిబ్బంది వచ్చి కళ్లను సేకరించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

నార్నె గోపినాథ్‌కు కేంద్ర ప్రభుత్వ అవార్డు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా వినియోగదారులకు ఉత్తమ సేవలందించినందుకుగాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి అత్యున్నత సేవా అవార్డులు లభించగా వారిలో తానూ ఉన్నాని చిలకలూరిపేటకు చెందిన నార్నె గోపినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ నుండి అందుకున్నట్లు పేర్కొన్నారు. తనతోపాటు బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన ఆలపాటి సంధ్య ఉన్నారని తెలిపారు. కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా అత్యధిక సంఖ్యలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల లావాదేవీలను జరిపినందుకు అవార్డు లభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సేవలు అందించిన 10 మందిని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. ఆలపాటి సంధ్య 1,02,952 లావాదేవీలు, చిలకలూరిపేటకు చెందిన తాను 84,526 లావాదేవీలను గత ఆర్థిక సంవత్సరంలో జరిపి అవార్డుకు ఎంపికైనట్లు వివరించారు.

ఎంఈఓ -1గా ఏసుబాబు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల ఎంఈఓ-1గా ఏసుబాబు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 34 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఏసుబాబు నరసరావుపేట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయన ఇప్పటికే సత్తెనపల్లి డిప్యూటీ డిఇఓగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఎంఈఓ-1గా పనిచేసిన వేముల నాగయ్య ఈనెల 5న ఉద్యోగ విరమణ చేశారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - రెంటచింతల

డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన రెంటచింతలలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా పర్యవేక్షకులు అంకమ్మరావు మాట్లాడుతూ అందరూ దోమతెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు వర్షాకాలంలో వచ్చే దోమకాటు, బోదకాలు, మెదడువాపు, చికెన్ గున్యా మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బతుకుదెరువుపై డయేరియా కాటు



పిడుగురాళ్లలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

- పనులకు వెళ్లలేని బాధితులు.. పస్తులుంటున్న కుటుంబాలు..
- సమీక్షలు, పరామర్శలతో సరిపెడుతున్న ప్రభుత్వం
- ఊసేలేని కార్మిక కుటుంబాల పోషణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సున్నపు బట్టీల్లో రెక్కలు ముక్కలు చేసుకుని పొట్టపోసుకునే కుటుంబాలను డయేరియా అతలాకుతలం చేస్తోంది. ఒకటికాదు రెండు కాదు 15 రోజులకుపైగా కూలి పనులకు వెళ్లలేని కుటుంబాల్లో అప్పులు చేస్తేగాని పొయ్యి వెలగని దుస్థితి నెలకొంది. సున్నపు పరిశ్రమకు దక్షిణ భారతదేశంలోనే పేరుగాంచిన పిడుగురాళ్లలోని పరిశ్రమలకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నా వాటిల్లో దుమ్మకొట్టుకుంటూ పని చేసే కార్మికులు మాత్రం విస్మరణకు గురవుతూనే ఉన్నారు. ఆపదొచ్చినప్పుడల్లా బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు.

పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో 800పైగా కుటుంబాలుంటాయి. ఈ ప్రాంతాల్లోని 95 శాతం కుటుంబాలు సున్నపు పరిశ్రమలలో పనికెళ్లి జీవనం సాగించేవారే. అయితే 15 రోజుల నుండి డయేరియా విజృంభిస్తూ వీరిని ఉపాధికి దూరం చేసింది. అధికారిక లెక్కల ప్రకారమే 200 మందికిపైగా డయేరియా బారిన పడగా ఈ సంఖ్య 300కుపైగానే ఉంటుందని అంచనా. నలుగురు

> **డయేరియా బాధితులకు స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక వైద్యమే చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. సెలైన్, రెండు మూడు రకాల బిళ్లలే ఇస్తున్నారని, రెండ్రోజుల్లో తగ్గకపోతే గుంటూరు, నరసరావుపేట, సత్తెనపల్లిలోని ప్రభుత్వాస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారని ఇక్కడి వారంటున్నారు. ఇప్పటికే చేతిలో చిల్లిగవ్వలేక అవస్థ పడుతున్న బాధిత కుటుంబాలు వైద్యం కోసమూ ఊళ్లుపట్టుకుని తిరగడం ఎలా సాధ్యమవుతుందని వాపోతున్నారు.**



బాధితుణ్ణి అర్బన్ హెల్త్ సెంటర్ నుండి మరో ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబీకులు

మృత్యువాత పడ్డారు. డయేరియా బారిన పడినవారు ఆస్పత్రిపాలవడం, వారిని కాపాడుకునే ప్రయత్నంలో వారి కుటుంబీకులు ఉండడంతో వారికి పూట గడవడం కష్టమవుతోంది. వ్యాధి బారిన పడిన వారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం, వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటుందే గాని బాధిత కుటుంబాల పోషణ గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. డయేరియా బారిన పడినవారు కోలుకున్న తర్వాత కూడా 10 రోజుల వరకూ పనులకు వెళ్లలేకపోతున్నారు. ఈ కాలంలో ఇల్లు గడవాలంటే అప్పులు చేయడమో లేదా తమతోపాటు కుటుంబాన్ని పస్తులుండమో మినహా మరోమార్గం వారికి తోచడం లేదు. కరోనా వచ్చినప్పుడు కూడా కార్మికులు ఇదే దుస్థితిని అనుభవించారు. పరిశ్రమల యాజమాన్యాలు వారి లాభాలను చూసుకున్నారేగాని కార్మికుల గురించి మాత్రం ఆలోచించలేదు. ఇప్పుడూ వ్యాధి బాధిత కుటుంబాలు అదే దుస్థితిని అనుభవిస్తున్నాయి.

సున్నపు పరిశ్రమల వల్ల ఈ ప్రాంతంలోని వారు నిత్యం ఏదో ఒక అనారోగ్యాలకు గురవుతూనే ఉన్నారు. ఉపిరితిత్తు సమస్య ప్రధానంగా వీరిని వేధిస్తోంది. అయితే వీరికి ప్రభుత్వం నుండి ఆర్థిక, వైద్య పరంగా ప్రత్యేక సదుపాయాలేమీ కల్పించడం లేదు. తాజాగా డయేరియాతో ఒక మహిళ, ఇద్దరు పురుషులు, ఒక చిన్నారి మృత్యువాత పడ్డారని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం నుండి సాయమేమీ అందలేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ డయేరియా పరిస్థితిపై సిఎం సమీక్షించినా, ఈ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించినా, మృతుల కుటుంబాలను పరామర్శించినా వారి పోషణ మాటేమిటనేనది మాత్రం ఎత్తడం లేదు.

ఇల్లు గడిచేదెలా?



డయేరియాతో రెండ్రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. నాకు ముగ్గురు పిల్లలు. నేను పనికి పోతే రోజుకు రూ.200-300 వచ్చేవి.. వాటితో ఇల్లు గడిపేవాణ్ణి. ఇప్పుడు నేనే ఆస్పత్రిపాలవడంతో కుటుంబం గడవడం కష్టమవుతోంది.

వేముల నాగరాజు, కార్మికుడు.

ప్రభుత్వ సాయం కావాలి



రోజూ కూలి పనులకు వెళితేనే మా ఇళ్ల గడుస్తాయి. ఇప్పుడు పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాం.. ప్రభుత్వమే ఆదుకోవాలి. నిత్యం ఇక్కడ ఏదో ఒక అనారోగ్య సమస్యలు వస్తూనే ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి.

నంద్యాల భూలక్ష్మీ, కార్మికురాలు.

తహశీల్దార్ రామ్మోహన్‌రావు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల



రామ్మోహన్‌రావు (ఫైల్)

రెంటచింతల మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న సబ్బు రామ్మోహన్రావు (59) మంగళవారం తెల్లవారుజామున ఒంగోలులోని సంఘం కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈయన 30 ఏళ్లపాటు రెవెన్యూ శాఖలో పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9న నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నుంచి రెంటచింతలకు తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈనెల 1వ తేదీన రైలులో ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా పడిపోవడంతో రైల్వే పోలీసులు సత్తెనపల్లికి అక్కడ నుంచి గుంటూరులోనే కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్‌కు సంబంధించి చికిత్స పొందుతూ చనిపోయారు. ఈయనకు భార్య విజయలక్ష్మి ఇద్దరు సంతానం ఉన్నారు. రామ్మోహన్‌రావు భౌతికకాయాన్ని రెవెన్యూ అధికారులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పిచారు. తహశీల్దార్ మృతికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - పెదకూరపాడు : బాలలు తమ హక్కులు తెలుసుకోవాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కాంతారావు అన్నారు. స్థానిక జెడ్‌ఫి పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరమణ అధ్యక్షతన పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. విద్యాహక్కు చట్టంపై వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మున్ని మాట్లాడుతూ దిశా ఇతర చట్టాలను తెలుసుకోవాలన్నారు.

ఆ భవనాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

అధికారులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచన - పెదకూరపాడులో పర్యటన

ప్రజాశక్తి - పెదకూరపాడు

నిర్మాణాత్మకమైన ప్రణాళికతో పెదకూరపాడు సుస్థిరాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆయన మంగళవారం పర్యటించారు. నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయలు, సామాజిక అవసరాల కోసం వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఎమ్మెల్యేను టిడిపి జిల్లా కార్యదర్శి ఎ.రమేష్, సర్పంచ్ జి.రాజు కోరారు. అనంతరం రూ.42 లక్షలతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్మించి, వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురై నిరుపయోగంగా మారిన పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కారిస్తామన్నారు. నిర్లక్ష్యానికి గురైన విలేజ్ పార్క్, తాగునీటి చెరువుపై వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి అభివృద్ధి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దాత సమకూర్చిన స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ హయాంలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులను టిడిపి నాయకులు వివరించగా ప్రణాళిక ప్రకారం చేద్దామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.రామ్‌గోపాల్‌రావు, బి.ఆంజనేయులు, ఎం.సాగర్, వై.బ్రహ్మయ్య, ఎం.సత్యం, ఎ.ప్రసాదు, సిహెచ్.బుల్లిబాబు, ముంతాజ్, కల్పన, సుజాత పాల్గొన్నారు.



హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్ తదితరులు

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలను జీవో రూపంలో తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆశావర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఆశా వర్కర్స్ జిల్లా ఆరవ మహాసభలో ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లతో అదనపు విధులు నిర్వహించరాదని కోరారు. తనకు సంబంధం లేని పనులను ఆశాలతో బలవంతంగా చేయించడం మానుకోవాలన్నారు. ఆశా వర్కర్లకు వారాంతపు సెలవులు లేకపోవడంవల్ల, పని భారంతో మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశా యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ధనలక్ష్మి, లక్ష్మి, కోశాధికారిగా జ్యోతి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధనలక్ష్మి జిల్లా గౌరవా అధ్యక్షులుగా వై.నేతాజీ 20 మందితో వర్కింగ్ కమిటీని ఎన్నుకోవడం



మాట్లాడుతున్న ధనలక్ష్మి

జరిగింది. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ అనుకూల నిర్ణయాలు తీసుకోకపోతే పోరాటాలే తప్ప వేరే మార్గం లేదని అన్నారు. సమావేశంలో యునైటెడ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, ఎస్.కె హుస్సేన్‌వలి తదితరులు ప్రసంగించారు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

విద్యతోపాటు మెరుగైన వసతులుండాలి

మహిళా కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు ప్రభుత్వ మహిళా జూనియర్, డిగ్రీ కళాశాల, మహిళా వసతి గృహాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సందర్శించారు. కళాశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాలను, బోధన జరుగుతున్న తరగతి గదులను ఎమ్మెల్యే సందర్శించారు. ఉపాధ్యాయలు, విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు అందాలని కళాశాల అభివృద్ధికి తను సహకారం అందిస్తానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిందని, నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయిలు దోచుకుందని, కానీ కళాశాలను అభివృద్ధి చేయలేదన్నారు. కళాశాలలో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళా వసతి గృహం, భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు పౌష్టికహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్‌తో పాటు కార్పొరేటర్లు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో సచివాలయాల్లో వినతిపత్రాలు

ప్రజాశక్తి-గుంటూరు

రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈనెల 18, 19 తేదీల్లో గ్రామ సచివాలయాల్లో వినపత్రాలు ఇవ్వనున్నట్లు రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు కంచుమాటి అజయ్‌కుమార్, బైరగాని శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతులకు అందచేయాలని, గత సంవత్సరం ఖరీఫ్‌ల కరువు, తుపాను వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని, రైతులకు రూ.2 లక్షల వరకూ బ్యాంకు రుణాలు మాఫీ చేసి, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులు అందరికీ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటివి అమలు చేయాలని, ఉపాధి పనులు 200ల రోజులకు పెంచి, రోజుకూలీ రూ.600లు అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కావున ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

21న రజకవృత్తిదారుల మహాసభ

జయప్రదం చేయాలని నాయకుల ప్రచారం

ప్రజాశక్తి మంగళగిరి



21వ తేదీన మంగళగిరి తాడేపల్లి రజక వృత్తిదారుల మహాసభ పట్టణంలో తాడేపల్లి పట్టణంలోని నేతాజీ సెంటర్ లో గల అమరారెడ్డి భవనంలో జరిగే మహాసభను జయప్రదం చేయా లని కోరుతూ మంగళవారం రజిక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో వివిధ అపార్ట్మెంట్లో కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన టిడిపి కూడా ప్రభుత్వం బీసీలకు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభకు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాచ్మెన్ల కం ఇస్త్రీదారులకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసరావు, కే యానాది రావు, కే గిరిరాజు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి సహకరించండి

మంత్రి నారాయణకు ఎమ్మెల్యే మాధవి విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివద్ధికి సహాయ సహకారాలు అందించి అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే మాధవి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను మరియు ప్రధాన సమస్యలైన రోడ్లు డ్రైనేజీ సమస్యల నివేదికలను మంత్రి నారాయణ ముందు ఉంచారు. గత వైసిపి పాలకుల ధన దోపిడి కారణంగా నగరంలో అభివద్ధి కుంటుపడిందని , ఒక పనిని ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నారని మంత్రి దష్టికి ఎమ్మెల్యే గళ్ళ మాధవి తీసుకువెళ్లారు. నగరంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉన్నదని గత సంవత్సరం అనేక డయేరియా కేసులు మరియు మరణాలు సంభవించాయని మంత్రి దష్టికి తీసుకువెళ్లారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థలను చక్కదిద్దడానికి అవసరమైన అధునాతన మిషిన్లను మరియు పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచటమే మార్గమని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. అదేవిధంగా నగరంలో ఎప్పటినుండో నిలిచిపోయిన పీకల వాగు సమస్యను మంత్రి దష్టికి తీసుకెళ్లారు దీనిని మొదటి ప్రాధాన్యత కింద తీసుకొని పీకలవాగుకు మరమ్మత్తుల నిర్వహించి అవసరమైన చోట్ల చెప్టాలు సైడు గోడల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అదే మాదిరిగా నగరంలో వీధికుక్కల బెడద ఉన్నదని మంత్రి దష్టికి గళ్ళా మాధవి తీసుకెళ్లారు. గళ్ళా మాధవి చెప్పిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

పాడి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

మహిళా పాడి రైతలను, జాయింట్ లయబిలిటీగ్రూపు సభ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. పాడి రైతులు, కౌలు రైతులు సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ పశుపోషణ అడుగంటిపోతున్న తరుణంలో పశు పోషకులను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. అలాగే జాయింట్ లయబిలిటీ గ్రూపు సభ్యులకు అందించే రుణ పరిమితిని పెంచాలన్నారు. అలాగే ఖరీఫ్ లో సాగు నీరు అందిస్తున్న క్రమంలో పంట కాలువల్లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించలేదని, ఫలితంగా పంటలు ముంపుకు గురౌతున్నాయన్నారు. భారీ వర్షాలకు ఎద పెట్టన వరి కూడా ముంపుకు గురైందన్నారు. తక్షణమే కాలువల పూడిక తీయించిరైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన పాడి రైతుల సంఘం నాయకులు వేజళ్ళ తబిత, మేకల అనసూయ మాట్లాడుతూ పశుపోషణ ద్వారానే జీవనం సాగిస్తున్నామని, పశుదాణా, పశువుల ఖరీదు, వరిగడ్డి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పశుపోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున రాయితీతో కూడిన ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే వల్లభాపురం మహి జాయింట్


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన సాంబిరెడ్డి, మహిళా రైతులు

లయబిలిటీ గ్రూపు కన్వీనర్, కోకన్వీనర్ వల్లభాపురం ధర్మయ్య, విజయరాణి మాట్లాడుతూ భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తూ, పాడి పశువులతో జీవనం సాగిస్తున్నామన్నారు. తమ గ్రూపుకు గోదావరి చైతన్య బ్యాంకు ద్వారా రూ.5లక్షల రుణం అందిస్తున్నా చాలటం లేదని, అదనంగా ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని సబ్ కలెక్టర్ చెప్పారని సాంబిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో రైతులు అత్తోట వీరయ్య, ఎం.శ్యాంబాబు, మేకల కుమారి, శకుంతల, టి.శాంతకుమారి, సరోజిని పాల్గొన్నారు.

నేడు సిపిఎం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

సిపియం జిల్లా విస్తృత సమావేశం నేడు ఉదయం 10 గంటలకు సిపియం జిల్లా కార్యాలయంలో జరగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సిపియం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబురావు పాల్గొంటారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సకాలంలో హజరుకావాలని కోరారు.

ఎమ్‌టిఎంసి కమిషనర్‌గా అలిమ్‌బాష బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ గా అలీమ్ భాషా మంగళవారం మంగళగిరి నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది పుష్పగుచ్చలు అందజేసి, అభినందనలు తెలియజేశారు.

20వ తేదీన మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన ఉదయం 9.30 గంటలకు గోరంట్ల, హెూసన్న మందిర్ ఎదురుగా ఉన్న వికలాంగుల కోసం సమర్థనం ట్రస్ట్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రఘు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 4 ప్రముఖ కంపెనీలు పాల్గొని యువత కోసం ఉద్యోగావకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 18-35 ఏళ్ల వయసున్న కలిగిన వారు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పిజి విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హతల రెస్యూమ్, ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్హత ధృవపత్రాలు తీసుకొని, ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 63648 67800, 6364867801 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.



విశిష్టమైన సేవలు రోటరీ సొంతం

ప్రజాశక్తి-తాడేపల్లి

సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన విశిష్ట సేవలు అందించడమే రోటరీ లక్ష్యమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చంద్ర చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ మాజేటి తెలిపారు. మంగళవారం అపర్ణ క్లబ్‌హౌస్‌లో 2024-25 సంవత్సరానికి సంబంధించి తాడేపల్లి రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రావూరి రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించిన శరత్‌చంద్ర చౌదరి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ అందించే సేవలు పొందే వారితో పాటు రోటరీకి ఆర్థిక సహకారం అందించే వారికి కూడా సంతృప్తిగా ఉండాలని కోరారు. రోటరీ 3150 ద్వారా నూతన కార్యవర్గం చేపట్టే పనులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. నూతన అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ గత కార్యవర్గ అనుభవాలను తీసుకుని మంగళగిరి రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల స్ఫూర్తితో సభ్యులు సహకారంతో మరిన్ని మంచి కార్యక్రమాలు భవిష్యత్తులో చేపడతామని హామీనిచ్చారు. ఈ కార్యక్ర మంలో రోటరీ వైస్ ప్రెసిడెంట్ కాట్రగడ్డ శివన్నారాయణ, పూర్వ అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ పరుచూరి, చంద్ర ఓబు లారెడ్డి, అనిల్ చక్రవర్తి, మంగళగిరి అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, ఎ.మురళీమోహన్, కోశాధి కారి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులతో పాటు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

తొలి ఏకాదశికి సకల ఏర్పాట్లు


ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ కొండపైనున్న శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి తొలి ఏకాదశి తిరునాళ్ల బుధవారం జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 40 వేల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయిస్తున్నామని తెలిపారు. దేవాలయం నిర్మాణంలో ఉండడం వల్ల బాలాలయంలో, ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. ఘాట్ రోడ్డుకు బారీ గేట్స్, కొండపై ఆలయం వద్ద క్యూలైన్లు, ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానమూ ఏర్పాటు చేశారని వివరించారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న కొండపై సందర్శకులకు అన్నప్రసాదాలు, తాగునీటి స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కొండపై టాయిలెట్స్, మెడికల్ క్యాంపులు అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. హిమాలయ గురుజి బుధవారం సాయంత్రం 6:30 గంటలకు అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

పట్టణంలోని 32 వార్డు విష్ణుకుండి నగర్లో డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 32వ వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించే ందుకు వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వార్డు ప్రజలు పడుతున్న అవస్థలపై కౌన్సిల్లో చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ తోట కృష్ణవేణి, డిఈ వెంకయ్య, టిడిపి నాయకులు పివి సురేష్‌బాబు, ఆయుబ్ ఖాన్, సిహెచ్.కోటేశ్వరావు పాల్గొన్నారు.


అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్ బ్రహ్మనాయుడు

అంగన్వాడి కేంద్రంలో సర్పంచ్ తనిఖీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం తాళ్లపల్లి సర్పంచ్ పసుపులేటి బ్రహ్మనాయుడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసి బాలలకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఎత్తిపోతలలో జరిగే తొలి ఏకాదశి తిరునాళ్ల ఏర్పాట్ల గురించి అధికారులు, పూజారులతో చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకట్రామయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామాంజనేయ నాయక్, ఈవో సాంబయ్య, నాయకులు బి.సత్యనారాయణ, అమర నాగేశ్వరరావు, సిహెచ్.ఆంజనేయులు, కె.రామారావు, వెంకటేష్ నాయక్, పి.నాగకోటేశ్వరరావు, పి.భానుసంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సును విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యలను పరిష్కరం నిమిత్తం పట్టణంలోని (52 ఎకరాలు) టిడ్కో డివిజన్‌లోని విద్యుత్ కార్యాలయంలో గురువారం నిర్వహిస్తామని ఈ.ఈ. సి.హెచ్.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ హాజరవుతారని, వినియోగదారుల విద్యుత్ పరమైన సమస్యలేమున్నా వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చిలకలూరిపేట సబ్ డివిజన్ పరిధిలోని గణపవరం, యడ్లపాడు, చిలకలూరిపేట-1,2 పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, మేడికొండూరు మండలం డోకిపర్రు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు పరిసర ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.



నేడు ఏకలవ్యుని జయంతి వేడుకలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఏ.పీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ మంగళవారం తెలిపారు. స్థానిక ఎన్నార్టీ సెంటర్లోని సంఘ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం వద్ద బుధవారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.నాగేశ్వరరావు, బి.చిన్న నాయక్, పి.శ్రీనివాసరావు, డి.డేవిడ్ పాల్గొన్నారు.

ఇకపై నాలుగురోజులకు ఒకసారే నీరు

ప్రజాశక్తి - మాచర్ల


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటదాసు

పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి డ్రెయినేజీల్లో చెత్త చెదారం పేరుకుపోయింది. డ్రెయినేజీలు పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరింది. కమిషనర్ డి.వెంకటదాసు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బ్లాక్ అయిన డ్రెయినేజీలను దగ్గరుండి శుభ్రం చేయించారు. పట్టణంలో తాగు నీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులకు కారణాలను తెలుసుకున్న టిడిపి పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు తదితరులు పాడైన ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించి కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఫిల్టర్ బెడ్స్ పడిపోవటం వల్ల గతంలో రోజుమార్చిరోజు ఇచ్చే నీటి సరఫరా 4 రోజులకోకసారి ఇస్తున్నట్లు తెలిపారు. ఫిల్టర్ బెడ్స్ బాగు చేసే వారు ఇతర ప్రాంతాల నుండి రావాల్సి ఉందని, త్వరితగతిన మరమ్మతుల చేయిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టణంలోని పదో వార్డులోని వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్నారు.


వైద్యులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్


అన్ని ఆస్పత్రులనూ త్వరలోనే పరిశీలిస్తా : ఎమ్మెల్యే ప్రవీణ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ డాక్టర్లతో ఆయన నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని తన కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. పేదలు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదన్నారు. ఆసుపత్రి సిబ్బంది అందరూ రోగుల పట్ల సేవా భావంతో మెలగాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వైద్య వృత్తి ఎంతో బాధ్యత కలిగిన వృత్తి అని దానికి నూరుశాతం న్యాయం చేయాలని కోరారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వైద్య ఖర్చుల కోసం పేదలు అవస్థ పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే వైద్యం అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి సకాలంలో మందులు అందజేయాలన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. తాను త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రులను పరిశీలిస్తానని చెప్పారు.

'మోడ్రన్' అధినేత చేబ్రోలు మహేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - చిలకలూరిపేట



అమెరికాలోని మేరిల్యాండ్ స్టేట్ యూనివర్శిటీ విద్యారత్న డాక్టరేట్‌ను మెడ్రన్ విద్య సంస్థల అధినేత చేబ్రోలు మహేష్‌కు ఈ నెల 14న ఢిల్లీలో ప్రదానం చేసినట్లు ఆయన మంగళవారం తెలిపారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లో కూడా తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు గత 31 ఏళ్లుగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ పేద, మధ్య తరగతి వారికి విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్నదుకు గాను డాక్టరేట్‌ను ప్రధానం చేశారన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మహేష్‌ను ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అభినందించగా ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కుష్టు రహిత జిల్లాగా పల్నాడును నిలపాలి

పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రవి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా పల్నాడును నిలపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రచురించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కుష్టు నివారణలో భాగంగా అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 18 నుండి వచ్చే నెల 2 వరకు జరుగుతుందని, ప్రతి ఇంటికీ అశా కార్యకర్త, స్వచ్ఛంధ కార్యకర్తలు బృందంలా సర్వే చేయాలన్నారు. రాగి, రంగు, పాలిపోయిన, మొద్దు బారిన మచ్చలు కానీ, కాళ్లు చేతులు వంకర్లు పోయి వస్తువులను పట్టుకోలేకపోయినా చెవులు, శరీరం మీద బొబ్బలున్నా, ముఖం నూనె రాసినట్లు ఉన్నా, కళ్లు మూత పడకపోయినా బృందం దృష్టికి తీసుకురావాలన్నారు. కుష్టు వ్యాధి ప్రమాదకరం కాదని, చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా తగ్గుతుందని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. చికిత్స తీసుకుంటే వైకల్యం నుండి కాపాడుకోవచ్చని, కుష్టు వ్యాధికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స ఉచితమని తెలిపారు.

ఎస్‌పి తుషార్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

బాపట్ల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా గుంటూరు ఎస్‌పి తుషార్ దూడికి మంగళవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో జిల్లా పోలీస్ అధికారులు పోలీసు కవాతు నిర్వహించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీసు వందనం సమర్పించారు. తనకు జరిగిన సన్మానంకు ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి వివాదాలు లేకుండా పనిచేశారని జిల్లాకు మంచి పేరు తెచ్చారని అధికారులకు, సిబ్బందిని అభినందించారు. పలు అధికారులు మాట్లాడుతూ జిల్లాలో తక్కువ కాలం పనిచేసినా శాంతిభద్రతల పరిరక్షణకు తుషార్ దూడి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈస్ట్ డివిజన్ ఎయస్పి నిచికేట్ షేల్కి, అడ్మిన్ అడిషనల్ ఎస్‌పి జి వి రమణమూర్తి,లా ఆర్డర్ అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి హనుమంతు, క్రైమ్ అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు యస్ ఇ బి అడిషనల్ ఎస్పీ వేంకటేశ్వర రావు , పలువురు డిఎస్‌పిలుపాల్గొన్నారు.



నేడు నూతన ఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా నూతన ఎస్‌పిగా నియమితులైన ఎస్.సతీష్‌కుమార్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు. కాకినాడ నుంచి బదిలీ సతీష్‌కుమార్ జిల్లా ఎస్‌పిగా వస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్‌పిగా ఉన్న తుషార్ దూడి బాపట్ల జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

తూర్పు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దటానికి తగుసహాయం చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణను ఎమ్మెల్యే నసీర్ కోరారు. మంగళవారం సిఆర్‌డిఎ కార్యాలయంలో మంత్రి నారాయణను జిఎంసి కమిషనర్ కీర్తి చేకూరి, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవితో కలిసి గుంటూరు తూర్పు నియోజకవర్గం సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో మురికి వాడల్లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కొన్ని కాలనీల్లో సిమెంట్‌రోడ్లు లేవని, కొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా పాడై ఉన్నాయన్నారు. కొన్ని కాలనీల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి దష్టికి తీసుకొచ్చారు. కేవలం మున్సిపల్ వాటర్ నిర్వహణకు ఒక ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని, గత 40 సంవత్సరాలకుపైగా పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇప్పించాలని, ఆటోనగర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద నూతనంగా అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ విషయాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ క్షుణ్ణంగా పరిశీలించి తగు విధంగా అభివద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.



బియ్యం పంపిణి చేస్తున్న ట్రస్ట్ డైరెక్టర్ అంజలి రావూరి



రైల్వే స్టేషన్ లో హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం



నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక యడ్లలింగయ్య కాలనీ పూలే నగర్‌లో నిరుపేద నిర్వాసితులకు ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి మంగళవారం నిత్యావసరాలు పంపిణి చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బ తిన్న యానాదులు ఇళ్ల కప్పులకు అవసరమైన టార్పాన్స్ పంపిణిచేశారు. దాదాపుగా 20 కుటుంబాలకు సాయాన్ని అందించామన్నారు. బాల్యంలోనే పిల్లలను కూలి పనులకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చిన నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ పుస్తకాలను కూడా పంపిణీ చేస్తుందన్నారు. కాల్వకట్టలపై నివసిస్తున్న 20 మంది గిరిజన కుటుంబాలకు సరిపడా పరదాలను అందజేసామని అంజలి పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ వాలంటీర్ ఇంటూరి బెన్హర్, బందెల రమేష్, పుల్లయ్య తది తరులు పాల్గొన్నారు.

లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అడ్వైజర్‌గా కాకరపర్తి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన లైన్స్‌క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం 2024-25 సంవత్సరానికి గాను లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 316 హెచ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్లో జిల్లా గవర్నర్ అడ్వైజర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు మంగళవారం సుబ్రమణ్యం వెల్లడించారు.

హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ నాగరాజా ఆధ్వర్యంలో మంగళగిరి రైల్వే స్టేషన్లో మంగళవారం హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ హెల్మెట్ యొక్క ప్రాధాన్యత ద్విచక్ర వాహనంపై రోడ్డుపైన హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిగే అనర్ధాలు గురించి వివరించడం జరిగింది. రోడ్డుపై వెళ్లే కుటుంబ యజమాని హెల్మెట్ లేకుండా మరణిస్తే వారి భార్య బిడ్డలు వారి తల్లిదండ్రులు అనాధలు అయిపోతారు అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కడు బాధ్యతతో మెలుగుతూ వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పెద్ద బుజ్జి, పారా లీగల్ వాలంటీర్ మల్లవరపు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్టును ప్రచారం చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను మండలంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంగళవారం తహశీల్దార్‌నకు యాక్ట్ రాష్ట్ర అధ్యక్షులు కారుమంచి రామారావు వినతి పత్రం అందజేశారు. ప్రతినెల 30వ తేదీన జరగవలసిన పౌరహక్కుల దినోత్సవం మంగళగిరి మండలంలో జరగటంలేదని, పూర్తిగా జీవో ఎంఎస్ 92,112 సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ జీవోలను తుంగలో తొక్కి, దళిత చట్టాల పట్ల వివక్షత చూపుతున్నారని దీంతో అగ్రవర్ణ వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా దళితులు పై దాడులు చేస్తున్నారని, అంటరానితనం పాటిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ 18 జీవోలను పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగులు విస్మరించారని, గత ఎమ్మార్వో ఎక్కడ కూడా ఒక్క రోజు కూడా దళిత చట్టాలపై అవ గాహన తీసుకురాలేదని, ప్రజలలో అవగాహన కల్పించి దళితులపై దాడులను నివారించాలని కోరారు.

యుపిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలోని డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ ఆరాధన పట్నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. యూపీహెచ్ సీలో 12 రకాల విభాగాల్లో అందుతున్న సేవలు అలాగే ఆ సేవల కంప్యూటరీకరణ, రికార్డులలో ఏవిధంగా నిక్షిప్తం చేస్తున్నదీ ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి విభాగం గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మానస వివరించారు. యూపీహెచ్ సీ నిర్వహణ విధానాలు, సేవలను పరిశీలించిన ఆరాధన పట్నాయక్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో యూపీహెచ్ సీ నిర్వహణ, సేవలు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్న మన్మోహన్ మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్ సీ వైద్యాధికారి, సిబ్బంది ప్రజారోగ్యాన్ని కాపాడటంలో చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, హెచ్ డబ్ల్యూసీ రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల, స్టేట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ దేవి, డీపీవో సైమన్, ఆర్కేఎస్కే స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, హెచ్‌వి రమాదేవి పాల్గొన్నారు.

బోస్ రోడ్డులో కాలువల పూడిక తీత

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న మురుగునీటి పారుదల సరళీకృతం చేసేందుకు అధికారులు కుస్తీ పడుతున్నారు. వ్యాపారులు కొందరు షాపుల ముందు సైడ్ డ్రెయన్లు పూడిక తీసేందుకు వీల్లేకుండా కాలువలను పలు చోట్ల మూసేశారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో మురుగు పారుదల లేక వర్షపు నీరు రోడ్డుపై చేరుతోంది. దీంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వ్యాపారులు మూసేసిన సైడ్ డ్రెయిన్లను పగుల గొడుతున్నారు. స్థానిక బోస్‌రోడ్డులో సీతాంబ హోటల్ కూడలి నుంచి పనుల ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష జరిపి, మురుగు పారుదలకు ఆటంకం లేదకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ 1,2 జడ్ సుధాకర్, ఎల్ సుబ్బారావు సిబ్బంది సహకారంతో చర్యలకు ఉపక్రమించారు.



దోమల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-తెనాలి

దోమల నియంత్రణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మలేరియా పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డు చినరావూరుతోటలో ఇంటింటికి తిరిగి దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంచారు. నీటి నిల్వలో లార్వాపై దోమల మందు చల్లించారు. దోమల వలన మలేరియా, పైలేరియా, చికెన్ గునియా, డెంగ్యూ, మెదడువాపు, వ్యాధులు వస్తాయని, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, డి శ్రీనివాసరావు, షేక్ రషీద్, చంద్రశేఖర్, చిన్న అంకమ్మ, కుమారి పాల్గొన్నారు.

రైతు బజార్లో తక్కువ ధరలకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లలో నిత్యావసరాలు విక్రమిస్తున్నట్లు సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల రత్నా టాకీస్ కూడలిలోని రైతు బజార్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌక ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయించే స్టాల్స్ సమయపాలన పాటించటం లేదని ఆగ్రహించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో అధికారులపై కూడా అసహనం వ్యక్తం చేశారు. దీంతో అప్రమత్తమైన సబ్ కలెక్టర్ తెనాలి డివిజన్ పరిధిలో పట్టణంలోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజారులో, అలాగే గంగానమ్మపేట రైతు బజార్, మంగళగిరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలోని రైతు బజార్లో, పొన్నూరు రైతు బజార్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్టీమ్ బియ్యం, రా బియ్యం, కందిపప్పు తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న చాంద్‌బాష

ఓపీఎస్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎస్, జిపిఎస్ అంగీకరించేది లేదని, ఓపిఎస్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. మంగళవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో చాంద్‌బాషా మాట్లాడుతూ జిపిఎస్ యాక్ట్ తాత్కాలికంగా నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయలు అందరూ పాత పెన్షన్ విధానం కావాలని కోరుకుంటున్నారని, సిపిఎస్‌కు, జిపిఎస్‌కు ఉద్యోగులు అంగీకరించే పరిస్థితుల్లో లేరని అన్నారు. గత దశాబ్దకాలం నుండి ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ శాపంగా మారిందన్నారు. గత ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేస్తాం అని చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఏ ప్రభుత్వం అయినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసి తీరాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, పెదరత్తయ్య, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, సహ అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



పి.శివప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పొందూరి శివప్రసాద్‌కు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ, బెల్గావి డాక్టరేట్ ప్రదానం చేసింది. శివప్రసాద్ ‘ మిల్లి డిగ్రీ ఎస్టిమేటర్ ఫర్ స్పేస్ సిగ్నల్స్ ఆన్ ఎఫ్‌పిజిఎ’ అనే అంశంపై జరిపిన పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు ఎంఎస్ రామయ్య ఇంజినీరింగ్ కాలేజి బెంగుళూరు కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ వి.ఆనంది పర్యవేక్షరాలుగా, డాక్టర్ పి.సత్యనారాయణమూర్తి సహాయ పర్యవేక్షకుడిగా వ్యవహరించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ఫిర్యాదుతో ఉపాధ్యాయునిపై విచారణ

ప్రజాశక్తి తెనాలి

రూరల్ గ్రామం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పై జిల్లా కలెక్టర్కు విద్యార్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు షేక్ యాస్మిన్, బి అవంతిక, ఎన్ సుప్రజ కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. తెలుగు ఉపాధ్యాయులు నాగేశ్వరరావు బోధన సరిలేదని, ఆయనను బదిలీ చేయాలని వివరించారు. విద్యార్థినుల ఫిర్యాదు పై స్పందించిన కలెక్టర్ విచారణకు జిల్లా విద్యాధికారిని ఆదేశించగా, ఆమె ఆదేశాల మేరకు తెనాలి జిల్లా ఉప విద్యాధికారిణి శాంతా కుమారి, మండల విద్యాధికారి డాక్టర్ ఎం లక్ష్మీనారాయణ పాఠశాలలో విచారణ చేపట్టారు. అధికారులు తొలుత తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడగా, వారు ముక్తకంఠంతో తెలుగు ఉపాధ్యాయుడిని బదిలీ



విచారణలో పాల్గొన్న డివైఈఓ, ఎంఈఓ

చేయాల్సిందేనని కోరారు. తెలుగు బోధనలో లిఖితపూర్వకంగా ఆయన చేసిన తప్పిదాలను వెల్లడించారు. దీంతో స్పందించిన అధికారులు నాగేశ్వరరావు ను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అలాగే పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని తెలుగు బోధించేందుకు సర్దుబాటు చేశారు. విద్యార్థుల సమస్యపై సకాలంలో స్పందించని హెడ్మాస్టర్ సరళను కూడా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావతం కాకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలు ప్రధానోపాధ్యాయుల దష్టికి వచ్చిన వెంటనే స్పందించాలని, ఇంకా పాఠశాలల్లో ఎక్కడైనా ఈ పరిస్థితి ఉంటే అధికారుల దష్టికి తేవచ్చని వారు స్పష్టంచేశారు.

పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సోసైటీ (పీఎసీఎస్) కంప్యూటరీకరణ కార్యక్రమం నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించేం దుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అప్కాబ్ చైర్మన్ ఎ.బాబుకు తెలిపారు. మంగళవారం విజయవాడ అప్కాబ్ కార్యాలయం నుంచి అప్కాబ్ చైర్మన్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌లో కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిసిసిబి సీఈఓ కష్ణవేణితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 167 పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణకు సంబంధించి నమోదు చేసిన వివరాలను సేకరించటం జరిగిందని పూర్తిస్థాయిలో పరిశీలన చేసి అప్‌లోడ్ చేయటం జరుగుతుందన్నారు. వ్యవసాయం అనుబంధ రంగాలతో పాటు ఇతర ఎంఎస్‌ఎంఈలకు సంబంధించి వివిధ ప్రభుత్వ పథకాల మార్గదర్శకాలకు అనుగు ణంగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జనరల్‌బాడీ సమావేశంలో జిల్లా సహకార బ్యాంకులలో డిపాజిట్లు సేకరణ, ఇతర అంశాల అమలుకు జారీచేసిన సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రత్నకుమారి

స్థానిక సంస్థల బలోపేతంపై ఫైనాన్స్ కమిషన్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు : మంగళవారం కలెక్టరేట్‌లోని డిఆర్‌సి సమావేశ మందిరంలో ఐదవ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి స్థానిక సంస్థల బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహిం చారు. ఉదయం సెషన్స్‌లో ఐదవ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ డాక్టరు కెవి రమణారెడ్డి, మెంబర్లు కపారావు, ఎంవిఎస్ పద్మరావు, జిల్లా పంచాయితీ అధికారి శ్రీదేవి, జెడ్పీ డిప్యూటీ సిఇఒ మోహనరావుతో కలసి డిఎల్‌పిఒలు, ఎంపీడీవోలు, ఈవోపీ ఆర్డీలు, పంచాయితీ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం కమిషన్ చైర్‌పర్సన్ సభ్యులు గుంటూరు, మంగళగరి- తాడేపల్లి నగరపాలక సంస్థలు, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీల కమిషనర్లు, రెవెన్యూ, ఇంజినీ రింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం కోసం అదాయ వనరులు మెరుగు పర్చుకోవటానికి ఉన్న అవకాశాలు, ఖర్చుల నియంత్రణ, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిం చాల్సిన ఆర్థిక సహాయ సహకారాలు తదితర అంశాలపై స్థానిక సంస్థల అధికారుల నుంచి కమిషన్ సభ్యులు అభిప్రాయాలు స్వీకరించారు. సమావేశంలో గ్రామీణ, పట్టణ స్థానికసంస్థల అధికారులు తెలియచేసిన అంశాల అమలుకు ప్రభుత్వానికి కమిషన్ తరుపున రికమండేషన్ చేస్తామని 5వ రాష్ట్రఫైనాన్స్ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి తెలిపారు.

జిఎంసి సిఎంహెచ్ఓ సరెండర్

శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ప్రజారోగ్యానికి భంగం కలిగేలా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడం పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడం, సమగ్ర పర్యవేక్షణ లోపంపై నగరపాలక సంస్థ సిఎంఓహెచ్ డాక్టర్ ఆషాని సరెండర్ చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. అలాగే బృందావన్ గార్డెన్స్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌విఎస్ ప్రసాద్‌ను సస్పెండ్, కొత్తపేట శానిటరీ ఇన్‌స్పెక్టర్ హిదయతుల్లాపై చార్జెస్ ఫ్రేంచేసి, అక్కడి నుండి బదిలీ చేస్తున్నామన్నారు. మంగళవారం కమిషనర్ బందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, బ్రాడీపేట, కోబాల్ట్‌పేట, కొత్తపేట, అరండల్‌పేట, పొత్తూరివారితోట, గుంటూరు వారితోట తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెంబడి చెత్తకుప్పలు ఉండడం, కార్మికులు ప్రధాన రోడ్ల స్వీపింగ్ ప్రారంభిచక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జరగని ప్రాంతాల్లో ప్రజలు రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేస్తున్నారని, ఆయా సచివాలయ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ప్రజారోగ్యానికి భంగం కల్గించేలా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏ స్థాయి అధికారులపైన అయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని పలు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్ నిర్దేశిత సమయం విధుల్లో ఉండడం లేదని, ప్రధానంగా మస్టర్‌కి కూడా హాజరు కావడం లేదని తమ దష్టికి వచ్చిందని, బుధవారం నుండి మస్టర్లను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. శానిటరీ సూపర్వైజర్లు పర్యవేక్షణ లోపం వలన పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వారి పనితీరును కూడా సమీక్ష చేస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల కల్లా కార్మికులు, కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్ల హాజరు నివేదిక తమకు పంపాలని, ప్రతి ఒక్కరూ వైర్‌లెస్ సెట్ తప్పనిసరిగా వినియోగించాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, సచివాలయం పరిధిలో చెత్త సేకరణ సమయం ముందుగా ప్రజలకు తెలియచేయాలన్నారు. మస్టర్ అయిన వెంటనే ప్రధాన రహదార్ల స్వీపింగ్ ప్రారంభించాలని, శానిటేషన్ కార్యదర్శులు కార్మికుల పనిని దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్నం ప్రాధాన్యత క్రమంలో గ్యాంగ్ వర్క్ జరగాలని, ప్రస్తుత వర్షాలకు డ్రైన్లలో వ్యర్థాలు అడ్డుపడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పర్యటనలో ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, శానిటరీ సూపర్వైజర్ సోమ శేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్ లోన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : మున్సిపల్ టీచర్లకు ప్రావిడెంట్ ఫండ్ లోన్లు మంజూరు చేయాలని యుటిఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యం.చిన్నయ్య, కె.ప్రభూజీ కోరారు. మంగళవారం జిఎంసి అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మికి మెమోరాండ్రం అందజేశారు. కుటుంబ అవసరాలు, అనారోగ్య సమస్యలు, పిల్లల ఫీజులు మొదలైన భవిష్యత్ అవసరాల కోసం దాచుకునే పిఎఫ్ ఖాతాల నుంచి లోన్లు మంజూరు కాక రెండు సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అడిషనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి పార్ట్ ఫైనల్ రూపంలో మంజూరు చేస్తామని అవసరం అయిన వారు



దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, బి.ప్రసాద్, బాజీబాబా, అజయ్‌కుమార్, ఎ.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

చేనేత, జౌళి శాఖ మంత్రి సవితకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు, రాష్ట్ర బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలను కేటాయించాలని, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ అన్నారు. సోమవారం రాత్రి గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న చేనేత, జౌళి శాఖ మాత్యులు ఎస్ సవితను ఆమె కార్యాలయంలో సంఘం నాయకులు కలిసి, తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత చేనేత వత్తి ప్రసిద్ధి చెందిందని అన్నారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని ఆయన అన్నారు. తద్వారా చేనేత కార్మికులు ఆకలి చావులతోనూ, ఆత్మహత్యలు చేసుకుని బలవుతున్నారని అన్నారు. అదేవిధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేనేత పై జిఎస్టి విధించడం వలన మరింత సంక్షోభంలోకి చేనేత రంగం నెట్టబడిందని ఆయన ఆవేదన చెందారు. గత ప్రభుత్వం నేతన్నలను ఆదుకునేందుకు నేతన్న నేస్తం పథకం పెట్టినప్పటికీ, షెడ్ కార్మికులకు, సహకార సంఘాలతో నేత నేస్తున్న కార్మికులకు ఈ పథకాన్ని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అంతేకాకుండా రాష్ట్ర బడ్జెట్లో చేనేత కార్మికులను ఆదుకునేందుకు బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు.



మంత్రి ఎస్ సవితకు వినతి పత్రం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు

తక్షణమే నేతన్నల ఆకలి చావులను నివారించేందుకు, చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు 2000 కోట్ల రూపాయలను కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేతపై జిఎస్టిని పూర్తిగా రద్దు చేసి, మగ్గం పై నేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం అమలు చేయాలన్నారు. బోగస్ చేనేత సహకార సంఘాలను వెంటనే రద్దు చేయాలని, పనిచేస్తున్న చేనేత సహకార సంఘాలను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా చేనేత కార్మికులకు మూడు సెంట్లు స్థలములో షెడ్ తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రైవేట్ సెక్టార్ చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పండ్ స్కీమును అమలు చేయాలన్నారు. పట్టు జరీ నూలు ను 2021 నాటి ధరలకు తగ్గించాలన్నారు. అదేవిధంగా చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం అందించాల న్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన త్రిఫ్ట ఫండ్ యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ 30% రిబేట్ సంవత్సరం మొత్తం కొనసాగించి, బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేస్తుంద న్నారు. అంతేకాకుండా చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు జరపాలన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, తమ సంఘం డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివ దుర్గారావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డోకిపర్తి రామారావు, కమిటీ సభ్యులు కౌతరపు వెంకటేశ్వరరావు, గురవయ్య తదితరులున్నారు.